బీటీ నిర్మాణం ఎప్పుడో?

- నిలిచిన బీటీ నిర్మాణ పనులు
- పట్టించుకోని అధికారులు


ఎల్కూర్ - చర్లగార్లపాడు గ్రామాల మధ్య తేలిన కంకర

మల్దకల్: గ్రామీణ రహదారులను మెరుగుపరచి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామీణ ప్రాంతాలకు బీటీ రహదారులను మంజూరు చేస్తోంది. అందులో భాగంగానే 2018లో అప్పటి మంత్రి జూపల్లి కృష్ణారావు పెద్దపల్లి నుంచి పావనంపల్లి వరకు రూ.1.39కోట్లతో రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అలాగే ఎల్కూరు నుంచి ఈదులపల్లి, చర్లగార్లపాడు మీదుగా నీలిపల్లి స్టేజీ వరకు రూ.4కోట్లతో బీటీ రహదారి పనులను శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించి నాలు గేళ్లు గడుస్తున్నా రహదారులు పూర్తికాకపోవడంతో గ్రామస్తులు, ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై ప్రయాణించే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కంకర వేసి వదిలేయడంతో రోడ్లపై ప్రతినిత్యం వాహనదారులు ఇబ్బందులు పడటమే కాకుండా ప్రమాదాలకు గురవుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లకు నిధులు రాకపోవడంతో పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు.

పట్టించుకోని అధికారులు

నిధులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను మధ్యలో వదిలేశారు. దీంతో పనులు అసంపూర్తిగా మధ్యలో నిలివేయడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి బీటీ రహదారి నిర్మాణ పనులు చేపట్టి సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నాలుగేళ్లైనా రోడ్డు పూర్తికాలేదు



పెద్దపల్లి నుంచి పావనంపల్లి వరకు నాలుగేళ్ల కిందట మూడు కిలోమీటర్ల మేర బీటీ రహదారి కోసం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. కంకర వేసి రోలింగ్ చేయకుండా అలాగే వదిలేశారు. వృద్ధులు, చిన్నారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

–జయన్న, పావనంపల్లి

ప్రమాదాలబారిన పడుతున్నాం



ఎల్కూరు నుంచి చర్లగార్లపాడు మీదుగా నీలిపల్లి స్టేజీ వరకు బీటీ రహదారి పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రోడ్డుపై కంకర తేలడంతో వాహనాలు అదుపుతప్పి ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నాం. సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు.

– కాంతారెడ్డి, చర్లగార్లపాడు

నిధులు మంజూరు కాలేదు



మండలంలోని ఆయా గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు అందకపోవడంతో పనులు నిలిచిపోయాయి. 50 శాతం పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. నిధులు మంజూరైన వెంటనే మిగతా రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించి పూర్తి చేస్తాం.

– భరత్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ

ఎంపీపీ తీరుపై అసహనం

- సర్వసభ్య సమావేశం వాయిదా


సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటిస్తున్న బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు

మానవపాడు: మండల కేంద్రంలో గురువారం సమావేశపు హాల్‌లో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అశోక్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా అధికార పార్టీ సభ్యులు ముగ్గురు ఎంపీటీసీలు హాజరయ్యారు. కాంగ్రెస్ నుంచి అశోక్‌రెడ్డి ఎంపీటీసీగా గెలుపొంది ఎంపీపీగా ఎన్నికయ్యారు. సమావేశానికి ఎంపీపీ మాత్రమే హాజరయ్యారు. కాంగ్రెస్ నుంచి మిగతా నలుగురు ఎంపీటీసీలు గైర్హజరయ్యారు. సమావేశం ప్రారంభంలోనే అధికార పార్టీ ఎంపీటీసీలు ఎంపీపీ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మీరు ఇంతకు ఏపార్టీలో కొనసాగుతున్నారని తేల్చాలని పట్టుబట్టారు. కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఎంపీపీ సమాధానమిస్తూ తాను ఎంపీటీసీగా కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచానని వివరించగా సభ్యులు వెంటనే బీఆర్‌ఎస్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే చల్లాతో ఎందుకు సాన్నిహిత్యంగా ఉంటున్నారని ఎంపీపీని ప్రశ్నించారు. ఇటు కాంగ్రెస్ పార్టీ నాయకులతో, అటు బీఆర్‌ఎస్ నాయకులతో చనువుగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరారు. మొదటినుంచి ఎంపీపీ మాజీ ఎమ్మెల్యే చల్లా అనుచరుడిగా ఉన్నారు. ప్రస్తుతం చల్లా బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నా అధికార పార్టీ కార్యక్రమాలలో ఎంపీపీ పాల్గొనడం విశేషం. ముగ్గురు ఎంపీటీసీలు సమావేశాన్ని బహిష్కరించారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామని ఎంపీటీసీ రోషన్న తెలిపారు. చేసేదేమీ లేక సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. సమావేశానికి కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీలు హాజరవుతారా, లేక అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతారా అని రాజకీయ నాయకులు గుసగుసలాడుతున్నారు. ఈ విషయమై ఎంపీపీ అశోక్‌రెడ్డి వివరణ కోరగా బీఆర్‌ఎస్ సభ్యత్వం తీసుకోలేదని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే సబ్బండవర్గాలకు మేలు


చందూరులో ఆశీర్వాదం తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

మానవపాడు: కాంగ్రెస్‌తోనే సబ్బండవర్గాలకు మేలు జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా గురువారం మండలంలోని పల్లెపాడు, చందూరు, బోరవెల్లి, జల్లాపురం గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయలకు అన్యాయం

గద్వాల అర్బన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం వాల్మీకి బోయలను విస్మరించిందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ వాల్మీకి బోయ కులస్తులను బీసీ–ఏ నుంచి ఎస్టీ జాబితాలో చేర్చుతామని హామీ ఇచ్చి మోసం చేయడం తగదన్నారు. వాల్మీకి బోయల తరుపున అసెంబ్లీలో సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క, పార్లమెంట్‌లో ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డిలు ప్రస్తావించారని గుర్తు చేశారు. సమావేశంలో శంకర్, సుజాత, బల్గెర నారాయణ రెడ్డి, ఇసాక్, జయ్యన్న, దీపక్, ఫిరోజ్, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు నాగ శిరోమణి, నాయకులు తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ టీపీతోనే అభివృద్ధి సాధ్యం


ధరూరులో కరపత్రాలు విడుదల చేస్తున్న రహ్మాన్

ధరూరు: వైఎస్సార్ టీపీతోనే తెలంగాణలో అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ గద్వాల నియోజకవర్గ కోఆర్డినేటర్ అతికూర్ రహ్మాన్ అన్నారు. గురువారం గడప గడపకు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ టీపీ మేనిఫెస్టోకు సంబంధించిన కర పత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో వైఎస్ షర్మిల పాదయాత్ర ద్వారా సమస్యలు తెలుసుకున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ అభిమానులు, కార్యకర్తలు యూనుస్, అంజి, నర్సింహా, ఇలియాస్ పాల్గొన్నారు.

కేటీదొడ్డి: వైఎస్సాఆర్ టీపీతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అసెంబ్లీ కో– ఆర్డినేటర్ అతికూర్ రహ్మాన్ అన్నారు. గురువారం మండలంలోని గంగన్‌పల్లి, పాతపాలెం గ్రామాల్లో ఆయన ఇంటింటికి తిరిగారు. మేనిఫెస్టో కరపత్రాన్ని ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనూస్, అంజి, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు సరికాదు


అలంపూర్ పోలీస్ స్టేషన్‌లో నాయకులు

అలంపూర్: ప్రజా సంఘాల నాయకులను ముందస్తు అరెస్టు చేయడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని, ప్రజా స్వామ్యాన్ని కూనీ చేయడమేనని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహా అన్నారు. పట్టణంలో ప్రజాసంఘాల నాయకులను గురువారం తెల్లవారుజామున పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం హైదరాబాదులోని ఇందిరా పార్కు వద్ద ధర్నా చేపట్టారు. ధర్నాకు వెళ్తున్నారని సమాచారంతో నరసింహాతోపాటు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపల్లె దేవదాసు, డీవైఎఫ్‌వై జిల్లా అధ్యక్షుడు బంగారు రఫీని ముందస్తు అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ముందస్తు అరెస్టును వారు తీవ్రంగా ఖండించారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లును పోలీసులు గురువారం ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

బీజేపీ బలోపేతమే లక్ష్యం



కేటీదొడ్డి: బీజేపీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రకాష్ రావు కోరారు. గురువారం మండలంలోని నందిన్నెలో బూత్‌స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర బూత్‌స్థాయిల ఇన్‌చార్జ్ మురళి, రాజు హాజరయ్యారు. రానున్న ఎన్నికలలో పార్టీ గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పట్టయ్య, భీమరాయుడు, డీలర్ వెంకన్న, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మెటీరియల్ పంపిణీ

శాంతినగర్: నియోజక వర్గ వ్యాప్తంగా శుక్రవారం నుంచి నిర్వహించే కార్నర్ మీటింగ్‌కు సంబంధించి మెటీరియల్‌ను బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ మెడికల్ తిరుమల్‌రెడ్డి గురువారం పంపిణీ చేశారు. వడ్డేపల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలకు మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్, మండల అధ్యక్షుడు నరసింహ, టౌన్ అధ్యక్షుడు రామకృష్ణ, రాజోళి బీజేవైఎం రంజిత్‌రెడ్డి, మానవపాడు జనరల్ సెక్రెటరీ అశోక్, మురళి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం



గద్వాల: ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్‌టీయూ ధ్యేయమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి అన్నారు. గురువారం గురువారం స్థానిక కార్యాలయం ఎదుట పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై పీఆర్‌టీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తిమ్మారెడ్డి మాట్లాడుతూ పీఆర్‌టీయూ పోరాటాల ఫలితంగానే ఉపాధ్యాయుల ఎన్నో సమస్యలను పరిష్కరించామన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. పదవీ విరమణ పొందిన సీనియర్ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో వేణుగోపాల్, నర్సింహారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, అద్దంకి రమేష్, ఏబేలు, బస్వరాజు, రంగన్న, రవి, పాల్గొన్నారు.

తండ్రి, కుమారుడిపై కేసు నమోదు

అలంపూర్/ఉండవెల్లి: పొలం తగాదాలో వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో గురువారం తండ్రి, కొడుకుపై కేసు నమోదయ్యింది. ఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామానికి చెందిన కోడెద్దుల హరికుమార్‌కు అలంపూర్ చౌరస్తాలోని శాంతినగర్ రోడ్డు మార్గంలో తన తండ్రి ద్వారా వారసత్వంగా వచ్చిన కొంత వ్యవసాయ పొలం ఉంది. ఈ పొలం విషయంలో ఉండవెల్లికి చెందిన అయ్యన్న కోర్టులో సివిల్ దావా వేశారు. దీంతో కోర్టు తీర్పు వెలువడేవరకు ఎవరు వ్యవసాయం చేయకుండా అలాగే వదిలేశారు. ఈ నెల 7వ తేదీన పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు గుంతలు తీస్తుండగా హరికుమార్ గమనించి వారిని ప్రశ్నించారు. ఇంతలో అయ్యన్న అతని కుమారుడు కలిసి హరికుమార్‌పై దాడి చేశారు. బాధితుడు హరికుమార్ ఫిర్యాదు మేరకు తండ్రి, కుమారుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో తెప్పోత్సవం


తెప్పోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ధరూరు: మండలంలోని అల్వాలపాడు తెలుగోనిపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రెండోరోజు గురువారం సాయంత్రం ఆలయంలో ఉపనయనం, తెప్పోత్సవం, పల్లకీ సేవ కనులపండువగా జరిగింది. శుక్రవారం స్వామివారి రథోత్సవం నిర్వహిస్తునట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. గద్వాల జిల్లా పరిసర ప్రాంతాలతో పాటు కర్ణాటక రాష్ట్రానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. తెప్పోత్సవం తిలకించి భక్తులు పరవశించిపోయారు. ఆంజనేయ నామస్మరణ మార్మోగింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు.

హోరా హోరీగా క్రికెట్ పోటీలు..

జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలు నాలుగు రోజులుగా హోరాహోరీగా కొనసాగుతున్నాయి. శుక్రవారంతో పోటీలు ముగియనున్నట్లు నిర్వాహకులు ఆనంద్, రాఘవేంద్రలు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు ఆద్య కేశవాచార్యులు, మాజీ సర్పంచు ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై చర్యలు తీసుకోండి


అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

అలంపూర్: మండలంలోని ఉట్కూరు గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ ఆంజనేయులు, నర్సన్ గౌడ్, కిషోర్, శ్రీను, తదితరులు సర్పంచ్‌పై గురువారం కలెక్టర్ వల్లూరు క్రాంతి, అడిషనల్ కలెక్టర్ అపూర్వ చౌహాన్, డీపీఓ, డీఆర్‌డీఓ పీడీ నాగేంద్రంను కలిసి ఫిర్యాదు చేశారు. సర్పంచ్ అయ్యస్వామి తల్లి మద్దెల లింగమ్మ నాలుగేళ్ల కిందట మృతి చెందిందని ఈమె పింఛన్ ఇప్పటికి రద్దు కాకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తునట్లు పేర్కొన్నారు. పింఛన్ నిలిపివేయకుండా పింఛన్ డబ్బులను కాజేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

గద్వాల రూరల్: మండలంలోని నల్లదేవునిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వివిధ రకాల అభివృద్ధి పనుల్లో నిధుల దుర్వినియోగం అయ్యాయని సర్పంచ్ మద్దిలేటి, గ్రామస్తులు తిరుపతి పేర్కొన్నారు. గురువారం వారు కలెక్టర్ వల్లూరు క్రాంతికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అదే విధంగా ఇటీవల గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు చేపట్టారని ఆ ప్రదేశంలో గతంలో ఊరబావి ఉండేదని తెలిపారు. భవిష్యత్తులో కమ్యూనిటీ హాల్‌కు కూలే అవకాశం ఉందని దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని వివరించారు.

కంటి వైద్య శిబిరం పరిశీలన


కేటీదొడ్డిలో కంటి వెలుగు శిబిరంను సందర్శించిన జెడ్పీ సీఈఓ విజయనాయక్

అయిజ: కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్పెషల్ ఆఫీసర్ తిరుమలరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వేణిసోంపురంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కేంద్రాన్ని కంట్రోల్ టీం సభ్యులు, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ మధుసూదనరెడ్డి, జిల్లా ఎన్‌సీడీ కోఆర్డినేటర్ శ్యాం సుందర్ పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ విష్ణు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రంతో పాటు లింగపురం గ్రామాల్లో గురువారం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో 283 మంది పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 13 మందికి రీడింగ్ అద్దాలు పంపిణీ చేశారు. 23 మందికి ఆన్‌లైన్‌లో అద్దాలు ఆర్డర్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ తిమ్మప్ప, డాక్టర్ నరేష్, స్వర్ణలత, మక్బూద్, వెంకటాద్రినాయుడు, సూపర్‌వైజర్ వఘ్నేశ్వరి, జయమ్మ, ఏఎన్ఎం పార్వతి, ఆయా గ్రామాల ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ సీఈఓ విజయ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కంటి వెలుగు శిబిరంను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహమ్మద్ అజార్ మోహీద్దీన్, ఎంపీఓ సయ్యద్‌ఖాన్, డాక్టర్ అశ్విని, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కనులపండువగా చట్ట సేవ


చట్ట సేవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

అయిజ: పట్టణంలోని తిక్క వీరేశ్వర స్వామి జాతర సందర్భంగా బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం రాత్రి స్వామివారి చట్ట సేవను వైభవంగా నిర్వహించారు. భాజా భజంత్రీలతో, మేళ తాళాలతో కనుల పండువగా కొనసాగింది. స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై ప్రతిష్ఠించి ఊరేగించారు. భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు గురువారం స్వామివారికి పూజలు చేశారు. రాత్రి శాంతి హోమం, ప్రభోత్సవం నిర్వహించారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయం


మాట్లాడుతున్న మాణిక్యరెడ్డి

గద్వాల: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా యూటీఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్నగారి మాణిక్యరెడ్డి గురువారం జిల్లాలోని పలు పాఠశాలలో ప్రచారం నిర్వహించారు. ఆయా పాఠశాలలో ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల్లో బలపరచి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తిప్పన్న, గోపాల్, చక్రధర్, రాజశేఖర్, హనుమంతురెడ్డి, చంద్రకాంత్, వెంకటరమణ, ప్రకాష్, శివకుమార్, చిరంజీవి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కోతలతో రైతుల అవస్థలు


ఉండవెల్లిలో నిరసన తెలుపుతున్న రైతులు

ఉండవెల్లి: కరెంట్ కోతలతో రైతుల అవస్థలు పడుతున్నారని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట రైతులు నిరసన తెలిపారు. 24 గంటల విద్యుత్ సరఫరా దేవుడెరుగు కాని కనీసం 12 గంటలు కూడా సరఫరా కావడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కజొన్న, మినుములు, కంది, తదితర పంటలు ఎండిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సీఎం కేసీఆర్ హామీ మేరకు 24 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని లేనిపక్షంలో విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు శ్రీరామ్ రెడ్డి, గోపాల్, కాల్వ శ్రీనివాసులు, శ్రీనివాసులు, స్వాములు, చిన్న రాముడు, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.


మద్దతు తెలుపుతున్న రామచంద్రారెడ్డి

రైతులకు బీజేపీ మద్దతు

అయిజ: సీఎం కేసీఆర్ రైతులకు ఉచితంగా 24 గంటల విద్యుత్‌సరఫరా చేస్తామని హామీ ఇచ్చినా కనీసం నాలుగు గంటలు కూడా విద్యుత్ సరఫరా చేయడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆరోపించారు. గురువారం మండలంలో విద్యుత్ సరఫరా కోతలతో విసుగుచెంది పట్టణంలోని గద్వాల రోడ్డు పక్కన ఉన్న సబ్‌స్టేషన్‌ముందు రైతులు ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్నా బీజేపీ నాయకులు రైతులకు మద్దతు తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం నుంచి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడతో రైతులు ధర్నాను విరమించారు. కార్యక్రమంలో అలంపూర్ అసెంబ్లీ కన్వీనర్ మెడికల్ తిరుమలరెడ్డి, పట్టణ అధ్యక్షుడు నరసింహయ్యశెట్టి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భగవద్గీత పఠనంతో జ్ఞానం



గట్టు: భగవద్గీత పఠనంతో జ్ఞానం కలుగుతుందని త్రైత సిద్ధాంత ఇందూ జ్ఞానవేదిక–ప్రబోధ సేవా సమితి గద్వాల కమిటీ అధ్యక్షుడు తాన్యా నాయక్ అన్నారు. మండలంలోని వాయిలకుంట తండాలో గురువారం త్రైతసిద్ధాంత భగవద్గీత ఆధ్యాత్మిక గ్రంథముల ధర్మ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా తాన్యానాయక్ మాట్లాడుతూ భగవద్గీత ద్వారా కర్మవిధానం తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, కాంట్రాక్టర్ శ్రీనాథ్, రిటైర్డ్ తహసీల్దార్, మునెప్ప, చిట్టి రవీందర్, దేవి, రాముడు, పాండు, లక్ష్మన్న, ప్రసాద్, అనితలు పాల్గొన్నారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



అయిజ: పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర శివ రామాలయంలో గురువారం మూడో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేదపండితులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మనుమయాధి, పంచబ్రహ్మ, అవాహన, సర్వతోభద్ర మండలి, శ్రీచక్ర, నవగ్రహ, అష్టదిక్పాలక ఆవాహన పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

రాష్ట్రస్థాయిలో విద్యార్థుల ప్రతిభ



శాంతినగర్: రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పరీక్షా పే చర్చ కార్యక్రమంలో రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రధానమంత్రి ఆదేశానుసారం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం రాష్ట్రస్థాయిలో పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. రామాపురం పాఠశాల విద్యార్థులు పాల్గొని పెయింటింగ్‌లో ప్రతిభ కనబరిచారు. బీజేపీ అలంపూర్ తాలూకా ఇన్‌చార్జ్ రాజగోపాల్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరుణ్‌రషీద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు ఏర్పాటు చేయొద్దు

గద్వాల: పట్టణంలోని ప్రధాన చౌరస్తాలలో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాల చుట్టూ వివిధ రాజకీయ పార్టీల, నాయకుల ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేస్తూ విగ్రహాలు కనిపించకుండా పోతున్నాయని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మహనీయుల విగ్రహాల చుట్టూ ఎవరి ఫ్లెక్సీలను ఏర్పాటు చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గురువారం వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని ప్రధాన చౌరస్తాలలో, విద్యుత్ స్తంభాలకు నాయకులు ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీ బోర్డులు ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రవి, దివాకర్, భగవాన్, డానియేల్, రంగన్న, ఫయాజ్, నూరుద్దీన్ ఉన్నారు.

ఆస్తిపన్ను చెల్లించకుంటే చర్యలు



అయిజ: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఆస్తిపన్ను చెల్లించకుంటే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ నర్సయ్య హెచ్చరించారు. గురువారం పట్టణంలో వివిధ కాలనీల్లో మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆస్తిపన్నును వసూలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఆస్తిపన్ను చెల్లించని వారికి జరిమానాలో మినహాయింపు ఇచ్చినట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్చి నెలాఖరువరకు ఆస్తిపన్ను చెల్లించని వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న టాయిలెట్ 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్షర పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ గోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.